ఎస్సీ, ఎస్టీ అసైన్డ్ భూములకు హక్కు కల్పించాలి

అభివాదం చేస్తున్న నర్సయ్య తదితరులు

చిక్కడపల్లి, ఆగస్టు 26: కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ ప్రకారం ఎస్సీ, ఎస్టీ అసైన్డ్ భూములు తిరిగి ఇచ్చి అన్ని హక్కులను పునరుద్ధరణ చేయాలని పలువురు వక్తలు పేర్కొన్నారు.తెలంగాణ భూరక్షణ సమితి ఆధ్వర్యంలో సోమవారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో అసైండ్ భూముల యాజమాన్య హక్కుల సాధన కోసం రౌండ్ టేబుల్ సమావేశంను నిర్వహించారు. సమితి నాయకుడు మైసయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో తెలంగాణ జన సమితి నగర అధ్యక్షుడు నర్సయ్య, ప్రొఫెసర్ పురుషోత్తం రాపోలు రాములు, తదితరు హాజరయ్యరు ఈ సందర్భంగా జన సమితి నగర అధ్యక్షుడు నర్సయ్య మాట్లాడుతూ దళిత, గిరిజనలకు దూరం అవుతున్న భూమి హక్కు కోసం పోరాటం చేయాలన్నారు. ఈ సమావేశంలో డీబీఎస్‌యూ నాయకుడు నర్సింహ, శివలింగం, ఇటికల లలిత, బీఎన్ రమేశ్ కుమార్, బండారు అశోక్ వర్ధన్, సారయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజల అభివృద్ధికి నిరంతరం కృషి

చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్‌తో సమస్యలపై చర్చిస్తున్న కార్వాన్ ఎమ్మెల్యే మహ్మద్ కౌసర్‌మొహినుద్దీన్

మెహిదీపట్నం, ఆగస్టు 26:ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించి అభివృద్ధి అందించడానికి నిరంతరం కృషి చేయాలని చాంద్రాయణ గుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ అన్నారు.సోమవారం కార్వాన్ ఎమ్మెల్యే మహ్మద్ కౌసర్‌మొహినుద్దీన్ అక్బరుద్దీన్ ఒవైసీని కలిసి నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి పనుల గురించి వివరించారు. దీనికి స్పందించిన అక్బరుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేయాలని సూచించారు.

మొక్కలు నాటి పరిరక్షించాలి

వన మహోత్సవంలో పాల్గొన్న ప్రభుత్వ సలహాదారు హెచ్.వేణుగోపాల్‌రావు

అంబర్‌పేట, ఆగస్టు 26 : నల్లకుంటలోని బ్రాహ్మణ హాస్టల్‌లో తెలంగాణ బ్రాహ్మణ సేవా సమంత, బ్రాహ్మణ స్టూడెంట్ హాస్టల్ సంయుక్తాధ్వర్యంలో సోమవారం వనమహోత్సవాన్ని నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ సలహాదారు(ప్రొటోకాల్) హెచ్.వేణుగోపాల్‌రావు హాజరయ్యారు. మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడం, పరిరక్షించడంపై విద్యార్థుల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థులకు వనసంరక్షణ ప్రైజ్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో రెనోవా హాస్పిటల్ డైరెక్టర్ డా.టి.వి.నగేష్, టీబీఎస్ఎస్ఎఫ్ ఫౌండర్ ప్రెసిడెంట్ కె.సురేష్‌చందర్‌రావు, బల్వంత్ రావు అడ్వకేట్, సురేష్, హాస్టల్ ప్రెసిడెంట్ రామారావు, ప్రకాష్‌రావు, అడ్వకేట్ శ్రీకాంత్, విశ్వేశ్వర్‌రావు, మహేష్‌యాదవ్, కాంగ్రెస్ నాయకులు అజయ్‌కుమార్, బి.శ్రావణ్‌కుమార్, లక్ష్మణ్, శరత్, సీహెచ్ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా మైదానంలో సౌకర్యాలు కల్పిస్తాం

అంబర్‌పేటలో ఉన్న క్రీడా మైదానాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, చిత్రంలో వీ. హనుమంతరావు

గోల్నాక, ఆగస్టు 26: అంబర్‌పేట మున్సిపల్ స్టేడియంలో అన్ని వసతులు కల్పిస్తామని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి తెలిపారు. సోమవారం మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హనుమంతరావు, కాంగ్రెస్ సీనియర్ నేత డాక్టర్ రోహిణ్‌రెడ్డి తదితరులతో కలిసి అంబర్‌పేట మున్సిపల్ మైదానాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మైదానంలో క్రీడా సామగ్రి అందజేయడంతో పాటు మరిన్ని సౌకర్యాల కల్పనకు కృషి చేస్తామని ఆయన తెలిపారు.కాంగ్రెస్ నాయకులు పంజాల జ్ఞానేశ్వర్ గౌడ్, లక్ష్మణ్‌యాదవ్, పులిజగన్, నారాయణ స్వామి,శంభుల శ్రీకాంత్ గౌడ్, సద్గురు తదితరులు పాల్గొన్నారు.



బస్తీ సంక్షేమానికి పాటుపడతా

ప్రజల సహాయ,సహకారాలతో బస్తీ సంక్షేమానికి పాటుపడతానని కార్వాన్ నియోజకవర్గం లంగర్‌హౌస్ డివిజన్ ఇబ్రహీంబాగ్ బస్తీ ఎస్‌సీఆర్‌పీ సొసైటీ నూతన అధ్యక్షుడు వినాయక దయానంద్ అన్నారు. సోమవారం ఇబ్రహీంబాగ్‌లో నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన దయానంద్‌ను బస్తీ వాసులు సన్మానించారు. – మెహిదీపట్నం



ఘనంగా ఎమ్మెల్యే ముఠా గోపాల్ జన్మదిన వేడుకలు

ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి సేవా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం జన్మదిన కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. పార్శిగుట్టలో బీఆర్ఎస్ నాయకుడు శ్రీకాంత్ ముదిరాజ్ ఆధ్వర్యంలో చేపట్టిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ముఠా గోపాల్ ప్రారంభించారు. రాంనగర్ ఈ సేవా సెంటర్ సయ్యద్ అస్లాం, కొండపల్లి మాధవ్, శ్యామ్‌సుందర్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఠా గోపాల్ జన్మదినం సందర్భంగా ఎమ్మెల్యే గోపాల్‌ను వి.సుధాకర్ గుప్త, రవి యాదవ్‌లు సత్కరించారు. ప్రేయర్ చర్చిలో ఎమ్మెల్యే ముఠా గోపాల్ ప్రత్యేక ప్రార్థనలు చేయగా ఆర్.మోజస్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం గాంధీనగర్‌లో గుర్రప్పు బగ్గీలో విహరించారు. – ముషీరాబాద్/చిక్కడపల్లి

ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ జన్మదిన వేడుకలు బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్కులో సోమవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో రాంనగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి మన్నె దామోదర్ రెడ్డి,బీఆర్ఎస్ నాయకుడు బబ్లూ, తెలంగాణ హౌస్‌ఫెడ్ డైరెక్టర్ కిషన్ రావు, నాగభూషణం, వాకర్స్ క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వివేక్, వెంకట్ స్వామి గౌడ్, వాకర్స్ పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.– చిక్కడపల్లి

హైదరాబాద్ నగర మాజీ మేయర్ దివంగత కొరివి కృష్ణస్వామి జయంతి వేడుకలు సోమవారం అంబర్‌పేట నియోజకవర్గం ముదిరాజ్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ వేడుకలను జరిపారు. –అంబర్‌పేట

తెలంగాణ స్టేట్ తైక్వాండోలో అంబర్‌పేట విద్యార్థులకు పతకాలు

తెలంగాణ స్టేట్ లెవల్ తైక్వాండో పోటీల్లో అంబర్‌పేట కవితా తైక్వాండో అకాడమీకి చెందిన విద్యార్థులు తమ సత్తాచాటి పతకాల పంట పండించారు. ఆదివారం మేడ్చల్ జిల్లా ఘట్ కేసర్ మండలం ఏదులాబాద్ గ్రామంలో డీఎస్ఆర్ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో అంబర్‌పేటకు చెందిన కవితా అకాడమీ విద్యార్థులు మొత్తం 58 మంది పాల్గొన్నారు. ఇందులో ఒమ్సీ, క్యోర్గి విభాగాల్లో 58 బంగారు, 31 వెండి, 23 కాంస్య పతకాలు మొత్తం 112 పథకాలు సాధించారు. ఈ సందర్భంగా సోమవారం అంబర్‌పేటలోని అకాడమీ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రాండ్ మాస్టర్ జయంత్ రెడ్డి, అర్గనైజింగ్ సెక్రటరీ హనుమంతు, అకాడమీ శిక్షకురాలు మాస్టర్ కవిత, మేనేజర్ శ్రీకాంత్ తదితరులు వీరిని అభినందించి మెడల్స్ అందజేశారు. – గోల్నాక, ఆగస్టు 26

ఎడ్ల సుధాకర్‌రెడ్డి పై విమర్శలు మానుకోవాలి

అంబర్‌పేట, ఆగస్టు 26 : కాంగ్రెస్ నేతలు కొందరు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎడ్ల సుధాకర్‌రెడ్డిపై విమర్శలు చేయడం మానుకోవాలని లేదంటే సహించేది లేదని అంబర్‌పేట నియోజకవర్గం బీఆర్ఎస్వీ అధ్యక్షుడు జేడీ రాహుల్ హెచ్చరించారు. దొంగలు..దొంగలు అని అరిచినట్లు కాంగ్రెస్ నాయకుల పరిస్థితి తయారైందన్నారు. సోమవారం రాహుల్ మీడియాతో మాట్లాడుతూ బతుకమ్మకుంట స్థలం అక్రమం కాదు సక్రమమని ఎడ్లసుధాకర్ రెడ్డి తన వద్ద ఉన్న ఆధారాలతో సహా హైడ్రాకు ఇస్తే అంబర్‌పేట నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు ఎందుకు ఉలిక్కి పడుతున్నారో అర్థం కావడం లేదని తెలిపారు.

ఇంకోసారి ఎడ్ల సుధాకర్‌రెడ్డి పై ఎలాంటి వ్యాఖ్యలు చేసినా సహించేది లేదని మరోసారి రాహుల్ హెచ్చరించారు.

కేంద్రమంత్రులపై ఒత్తిడి తేవాలి

మాట్లాడుతున్న జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం,తదితరులు

కాచిగూడ,ఆగస్టు 26: కేంద్రం బీసీల సమస్యల పరిష్కారానికి కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి,బండి సంజయ్, బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ ప్రధాని నరేంద్ర మోదీపై ఒత్తిడి తేవాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం డిమాండ్ చేశారు.సోమవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన విలేకరులతో ఆయన మాట్లాడుతూ కేంద్రం చేపట్టే జన గణనలో కులగణన చేసి, అసెంబ్లీలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. జనగణలో కులగణన చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో త్వరలో లక్షలాది మందితో దేశ వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలను చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు పాల్గొన్నారు.

ఉస్మానియా దంత కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ ఎస్ఎస్ యాదవ్

సుల్తాన్‌బజార్,ఆగస్టు 26: దంత సమస్యలతో వచ్చే రోగులకు కార్పొరేట్‌కు దీటుగా ఉస్మానియా దంత కళాశాల,దవాఖానలో నాణ్యమైన, వైద్య సేవలను అందజేసేందుకు తన వంతు కృషి చేస్తానని దంత కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమితులైన డాక్టర్ ఎస్ఎస్ యాదవ్ పేర్కొన్నారు. కళాశాలకు ప్రిన్సిపాల్‌గా నియమితులైన ఎస్ఎస్ యాదవ్‌ను వేర్వేరు విభాగాలకు చెందిన ప్రొఫెసర్లు,అసోసియేట్ ప్రొఫెసర్‌లు,అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు,పీజీలు,వైద్య సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు తాళ్ళగడ్డలో గరికపాటి నరసింహా రావు ప్రవచనం

కార్వాన్, ఆగస్ట్ 26 : శ్రావణమాసాన్ని పురస్కరించుకొని తాళ్ళగడ్డ హనుమాన్ ఆలయ ప్రాంగణంలోని శ్రీ గాయత్రి మాత ఆలయంలో శ్రీ గాయత్రి మాత విశిష్టత అనే అంశంపై ప్రవచనం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ప్రకాష్, నాగమణిలు తెలిపారు. మంగళవారం సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ ప్రవచనాన్ని మహా సవస్రావధాని, పద్మ శ్రీ పురస్కార గ్రహీత గరికపాటి నరసింహా రావు ముఖ్య అతిథిగా పాల్గొని వినిపిస్తారని నిర్వాహకులు తెలిపారు.

తెలంగాణలో పనిచేస్తున్న హోంగార్డులను ఏపీకి తీసుకురండి

కాచిగూడ,ఆగస్టు 26: తెలంగాణలో కొన్నేండ్లుగా పనిచేస్తున్న ఏపీ రాష్ట్రానికి చెందిన అనేక మంది హోంగార్డులను సొంత రాష్ట్రానికి తీసుకురావాలని హోంగార్డుల ప్రతినిధులు ఎస్.నారాయణరెడ్డి, బుజ్జిబాబు చంద్రబాబు నాయుడిని కలిసి సోమవారం కలిసి వినతి పత్రాన్ని అందజేశారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

కాచిగూడ,ఆగస్టు 26: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ మక్సూద్ వివరాల ప్రకారం గుర్తుతెలియని వ్యక్తి(45)సోమవారం ఉప్పుగూడ– యాకత్‌పుర రైల్వేస్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. మృతుని వివరాల కోసం 991222 1985లో సంప్రదించాలని హెడ్‌కానిస్టేబుల్ కోరారు.

వైర్ దొంగ రిమాండ్

కాచిగూడ,ఆగస్టు 26: జల్సాలకు అలవాటు పడి రద్దీగా ఉన్న ప్రాంతాలను ఎంచుకొని దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని కాచిగూడ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అడ్మిన్ ఎస్సై డి.సుభాష్ వివరాల ప్రకారం మల్కాజిగిరికి చెందిన ఎ.సాయి (35)జులాయిగా తిరుగుతూ రాత్రి సమయాల్లో రద్దీగా ఉండే పలు ప్రాంతాల్లో దొంగతనాలు చేస్తూ జల్సాలు చేస్తుంటాడు.ఈ నెల 24 రాత్రి సాయి కాచిగూడ ఎక్స్‌రోడ్డులో జరుగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల దగ్గర నుంచి రూ.30 వేల విలువ చేసే 30 కేజీల ఐరన్ వైర్‌బండల్‌ను దొంగిలించాడు. సైట్ ఇంజినీర్ సతీశ్ ఫిర్యాదు మేరకు సాయిపై కేసు నమోదు చేసి అతడి నుంచి వైర్‌బండల్‌ను స్వాధీనం చేసుకొని సోమవారం అరెస్ట్ చేసి,రిమాండ్‌కు తరలించినట్లు అడ్మిన్ ఎస్సై తెలిపారు.

స్వాతంత్ర్య సమరయోధులకు పురస్కారాలు ప్రదానం

స్వాతంత్ర్యసమరయోధులను సత్కరిస్తున్న ప్రముఖులు

తెలుగు యూనివర్సిటీ, ఆగస్టు 26: త్యాగానికి ప్రతీకలుగా నిలిచిన స్వాతంత్ర్యసమరయోధులను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాలచారి సూచించారు. కమలాకర చారిటబుల్ ట్రస్టు, కమలాకర లలిత కళాభారతి సంయుక్తాధ్వర్యంలో సుల్తాన్‌బజార్‌లో గల శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయం ప్రాంగణంలోని ఆడిటోరియంలో 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు నూతి శంకరరావు, కె. చంద్రప్రకాశరావుకు పురస్కారాలను ప్రదానం చేసి ఘనంగా సత్కంచారు. విశ్రాంత ఐఏఎస్ డాక్టర్ కె.వి రమణాచారి అధ్యక్షతన జరిగిన ఈ సభలో భాషా నిలయం కార్యదర్శి ఉడయవర్లు, రచయిత్రి డాక్టర్ కె.వి కృష్ణకుమారి, ధర్మ ప్రచారకులు ఆచార్య కసిరెడ్డి వెంకట రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ అంతం దళితుల పంతం

అభివాదం చేస్తున్న జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ తదితరులు

రవీంద్రభారతి,ఆగస్టు 26 : ఎస్సీ,ఎస్టీ వర్గీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమంను మరింత ఉధృతం చేస్తామని ఎస్సీ,ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలోబషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన మీడియా సమావేశంలో ప్రకటించారు.ఈ సందర్భంగా సమితి జాతీయ చైర్మన్ , దళిత బహుజన పార్టీ డీబీపీ జాతీయ అధ్యక్షుడు సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణస్వరూప్ మాట్లాడుతూ వర్గీకరణ అంతం ..దళితుల పంతం అనే నినాదంతో పాలకుల పైన పోరాటం చేస్తామన్నారు.వర్గీకరణపైన సుప్రీంకోర్టు తీర్పును ఉపసంహరించుకోవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం, రేవంత్‌రెడ్డి చేస్తున్న వర్గీకరణ ప్రయత్నం ఆర్డినెన్స్ ప్రయత్నం మానుకోవాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఉద్యమ కార్యాచరణను ప్రకటించారు.సెప్టెంబర్ 2న మండల తహసీల్దార్ కార్యాలయాల ముట్టడి, 11న అధికార ప్రతిపక్ష పార్టీల ప్రజాప్రతినిధుల ఇండ్ల దగ్గర నిరసన, 16 న జిల్లా కల్టెరేట్ కార్యాలయాల వద్ద నిరసన, 27న చలో హైదరాబాద్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం వద్ద ఆందోళన కార్యక్రమాలను చేపడుతామని ఆయన విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

శ్రీ కృష్ణ తత్వమే భగవద్గీత సారం

సుల్తాన్‌బజార్,ఆగస్టు 26: శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు అబిడ్స్ ఇస్కాన్ టెంపుల్‌లో ఘనంగా జరిగాయి. సోమవారం అష్టమి తిథి ప్రకారం ప్రతి యేడాది నిర్వహించే జన్మాష్టమి వేడుకలలో భాగంగా శ్రీ కృష్ణుడిని ప్రత్యేక అలంకరణతో పాటు పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనానికి అనుమతించారు. ఈయేడాది అబిడ్స్ ఇస్కాన్‌లో మూడు రోజుల పాటు వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్ టెంపుల్ మేనేజ్‌మెంట్ కమిటీ వరద క్రిష్ణ దాస్,సనల్ మేనేజర్ శంభు వైష్ణవ దాస్‌లు పేర్కొన్నారు.ఈ వేడుకలలో లక్షలాది మంది భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలను నిర్వహించారు.

అత్యంత సుందరంగా ముస్తాబు,ప్రముఖుల పూజలు

శ్రీక్రిష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని ఆలయంలో దేవతా మూర్తుల విగ్రహాలను అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు.ఆ విగ్రహాలు భక్తులను ఎంతగానో ఆకర్షిస్తున్నాయి. మొదటి సారి ఆలయం ఎదురుగా ఉన్న రహదారి పూర్తిగా మూసివేయడంతో భక్తులతో అబిడ్స్ రోడ్,నాంపల్లి స్టేషన్ రోడ్ కిటకిట లాడింది.అబిడ్స్ ఇస్కాన్ టెంపుల్‌లో ఏపీ మాజీ మంత్రి,సినీ నటి రోజాతో పాటు రైల్వే శాఖ ఉన్నతాధికారులు,పోలీస్ శాఖ ఉన్న తాధికారులు,కార్పొరేటర్‌లు పాల్గొని పూజలను చేపట్టారు.

పోలీసుల పటిష్ట బందోబస్తు

శ్రీ క్రిష్ణ జన్మాష్టమి సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు విచ్చేసే అవకాశం ఉన్నందును పోలీస్ శాఖ అధికారులు ముందు చర్యలలో భాగంగా జీపీవో నుండి నాంపల్లి రైల్వే స్టేషన్ రోడ్‌ను పూర్తిగా మూసి వేశారు.గతంలో ఒకే రహదారి నుండి రాకపోకలు సాగించడంతో తీవ్ర ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఈ యేడాది పోలీస్ అధికారులు తీసుకున్న ఈ నిర్ణయం సత్ఫలితాలను ఇచ్చింది. ఇదిలా ఉండగా వాహనదారులకు ఇబ్బందులు కలుగకుండా నాంపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ నేతృత్వంలో పటిష్ట చర్యలు తీసుకోవడంతో సజావుగా సాగింది.

అబిడ్స్‌లోని ఇస్కాన్ దేవాలయంలో భక్తులకు దర్శనమిస్తున్న శ్రీకృష్ణుడు

శ్యామ్‌బాబా మందిర్‌లో

కాచిగూడ: కాచిగూడ వీరన్నగుట్టపై వెలిసిన శ్యామ్‌బాబా ఆలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు శ్యామ్‌మందిర్ సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో శ్యామ్ మందిర్ సేవా సమితి అధ్యక్షులు చంద్రకాంత్ దకోటియా, కార్యదర్శి ఇందర్‌కరణ్ అగర్వాల్, సభ్యులు రామ్‌దేవ్ అగర్వాల్, నరేశ్‌దకోటియా, విశ్వనాథ్ టిబ్రెవాల్, తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లి,కార్వాన్ నియోజకవర్గాలలో..

మెహిదీపట్నం: నాంపల్లి,కార్వాన్ నియోజకవర్గాలలో సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. లంగర్‌హౌస్‌కు చెందిన సీనియర్ నాయకులు జెన్న సుధాకర్,మాతంగి రమేష్,నవీన్ తదితరులు పాల్గొన్నారు.

చిక్కడపల్లిలోని శ్రీ కృష్ణమందిరంలో 'శ్రీకృష్ణాజన్మష్టమి సందర్భంగా శ్రీ కృష్ణుడిని దర్శించుకొని పూజలు నిర్వహిస్తున్న ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి



అబిడ్స్‌లోని ఇస్కాన్ దేవాలయంలో..పోటెత్తిన భక్తులు

ఆలోకయే శ్రీ బాలకృష్ణమ్

తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో నృత్య కిన్నెర ఆధ్వర్యంలో సోమవారం రవీంద్రభారతిలో శ్రీకృష్ణాష్టమి సందర్భంగా నృత్యకిన్నెర 40 వార్షికోత్సవం సందర్భంగా ఆలోకయే శ్రీబాకృష్ణమ్ కూచిపూడి నృత్యప్రదర్శన ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్, తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారుడు (ఐఏఎస్) డాక్టర్ కె.వి రమణాచారి, డా.మామిడి హరికృష్ణ, సాహితీవేత్త వోలేటి పార్వతీశం విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. –రవీంద్రభారతి,ఆగస్టు 26

బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మహతి ఆర్ట్స్ థియేటర్స్ ఆధ్వర్యంలో శ్రీ కృష్టాష్టమి సందర్భంగా బృందావన చంద్రోదయం– శ్రీ కృష్ణుడికి సంగీత, నృత్య, నీరాజనం కార్యక్రమం నిర్వాహక సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జె.వి.రాజేశ్, రాజ్, ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. –చిక్కడపల్లి



శ్యామ్‌బాబాను దర్శించుకుంటున్న రామ్‌దేవ్ అగర్వాల్,శ్యామ్‌మందిర్ సేవా సమితి సభ్యులు